# ప్రజా వారధి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల   సంపుటి : 05   సంచిక : 257   పేజీలు : 04   వెల రూ. 2   గురువారం   16 - 04 - 2026





హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు

# సంపూర్ణ మద్దతు

- మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కేసీఆర్ నిర్ణయం ఇదీ
- డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి
- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని వెల్లడి
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు



**హైదరాబాద్ :**

భారత ప్రభుత్వం నేడు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర - మిగతా 2 లో

## దక్షిణాదికి అన్యాయం జరిగితే

# తీవ్ర పోరాటం తప్పదు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- నేడు పార్లమెంట్ లో డీలిమిటేషన్ బిల్లు
- దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని సర్వత్ర ఆందోళన
- దక్షిణాదికి అన్యాయం జరిగితే దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమానికి దారి తీస్తుందన్న కేటీఆర్
- దక్షిణాది ప్రజల విషయంలో బుద్ధిగా వ్యవహరించాలని కేంద్రానికి హితవు



2 లో

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన
- పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా
- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు

- ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం
- సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- 20 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం



2 లో

## భారత్‌లో తొలిసారి ముంబైలో పట్టాలెక్కనున్న నాన్ - ఏసీ క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు

- ప్రమాదాల నివారణ, వేడి నుంచి ఉపశమనం కల్పించడం ప్రధాన లక్ష్యం
- ఏసీ లేకున్నా 'ఫోర్స్డ్ వెంటిలేషన్' సిస్టమ్‌తో కోచ్‌లలో చల్లదనం
- చెన్నై ఐసీఎఫ్‌లో తయారీ.. త్వరలో ముంబై ట్రాక్‌లపై ట్రయల్స్
- సాధారణ ఛార్జీలకే ఏసీ రైలు తరహా భద్రతా ఫీచర్లు

**అమరావతి :**

దేశ ఆర్థిక రాజధాని ముంబై లోకల్ రైళ్లలో ప్రయాణించే లక్షలాది మందికి భారతీయ రైల్వే శుభవార్త అందించింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా నాన్-ఏసీ, ఆటోమేటిక్ డోర్లు మూసుకునే సదుపాయం - మిగతా 2 లో





2 లో

## 24ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు



- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- టీఎంసీ దోచుకున్న ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తాం
- బెంగాల్‌లో ఎన్నికల ర్యాలీలో అమిత్ షా- టీఎంసీ సర్కార్‌పై విమర్శలు




## ఏపీలో 38 లోక్‌సభ 263 అసెంబ్లీ స్థానాలు




- డీలిమిటేషన్‌తో మారనున్న సమీకరణాలు
- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లపై కేంద్రం దృష్టి
- నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కీలక బిల్లులు
- ఏపీలో 175 నుంచి 263కు పెరగనున్న అసెంబ్లీ స్థానాలు
- 25 నుంచి 38కి చేరనున్న లోక్‌సభ సీట్లు
- 2029 ఎన్నికల నాటికి కొత్త విధానం అమలు లక్ష్యం

**అమరావతి :**

దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే 2029 సాధారణ ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారనుంది.ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం, ఏపీలో - మిగతా 2 లో

## నీటి భద్రత కోసం

# 'జలధార'

- 'జలధార' యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలు
- ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచన
- జూన్ చివరి నాటికి వెలిగొండ మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- నేరడి బ్యారేజ్, చింతలపూడి కెనాల్‌కు త్వరలో టెండర్లు
- రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలాలు.. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు చర్యలు



**అమరావతి :**

రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు.పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ.5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు.రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి - మిగతా 2 లో

# సంపాదకీయం

## మళ్లీ యుద్ధ మేఘాలు!



చరిత్రాత్మకం అన్నారు. ఉన్నతస్థాయి చర్చలన్నారు. దౌత్యం పూర్తి స్థాయిలో పనిచేస్తోందన్నారు. శాంతికి పశ్చిమాసియా చేరువలో ఉందన్నారు. పాకిస్తాన్ రాజధాని ఇస్లామా బాద్‌లో 21 గంటలపాటు కొనసాగిన అమెరికాఇరాన్ ప్రతినిధి బృందాల చర్చలపై ఎప్పటికప్పుడు మీడియాలో వచ్చిన సమాచారం సారాంశమిది. తీరా బయటికొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చర్చలు విఫలమయ్యాయని ప్రకటించి నిష్క్రమించారు. ఆ వెంటనే ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపు భాష మొదలైంది. అమెరికా ఏకపక్ష వైఖరివల్ల 47 సంవత్సరాల తర్వాత ఆ రెండు దేశాలమధ్యా నేరుగా సాగిన చర్చలు చివరికిలా నీరుగారాయి. వచ్చేవారం మరోసారి చర్చలుంటాయని చెబుతున్నారు. కానీ అమెరికా వైఖరి మారకపోతే ప్రయోజనం శూన్యం. ట్రంప్ వచ్చాక చర్చల అర్థమే మారిపోయింది. చర్చలంటే ఆయన శాసిస్తే ఎదుటిపక్షం శిరోధార్యంగా స్వీకరించటం తప్ప మరేంకాదు. అసలు ఈ యుద్ధంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న వాన్స్ నాయకత్వాన ప్రతినిధి బృందాన్ని పంపటంలోనే ఆయన నిజాయితీలేమి వెల్లడైంది. ఏ అధికారమూ లేని, సొంతంగా ఎలాంటి చొరవా తీసుకోలేని ఆ అశక్త బృందం చివరకు ఉత్త డొల్లగా మిగిలిపోయింది.ట్రంప్ తీరు 90వ దశకం మొదట్లో సోవియెట్ యూనియన్ కుప్పకూలిననాటి పరి స్థితుల్ని తలపిస్తోంది. అంతవరకూ సోవియెట్ భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కడికక్కడ సమావేశాలు జరగటం, దేశంనుంచి విడిపోతున్నట్టు ప్రకటించటం రివాజై పోయింది. నిజంగా అలా ప్రకటించేవారి బలాబలాలేమిటో, ఆ తీర్మానాలు అమలయ్యే అవకాశం ఉందో లేదో తెలియని స్థితి. ఇలాంటి అనిశ్చితే ఇప్పుడు అమె రికాను ఆవరించింది. నరమేథాన్ని సాగిస్తూ ఘనవిజయాలుగా ప్రకటించుకోవటం, ఇరాన్ నాగరికత ఈ రాత్రితో అంతం కాబోతున్నదని ప్రకటించటం, అంతలోనే చర్చలకు రావాలంటూ బెదిరించటం ట్రంప్ అలవాటు చేసుకున్నారు. ఇజ్రాయెల్‌తోపాటు ఈ యుద్ధానికి లోపాయికారీగా మద్దతిచ్చిన దేశాలన్నీ ఇరాన్‌నుంచి శరపరంపరగా వచ్చి పడుతున్న క్షిపణుల ధాటికి బెంబేలెత్తినా, అక్కడ పెనువిధ్వంసం చోటుచేసుకుంటున్నా ట్రంప్ బడాయి మాటలు ఆగలేదు. ఆయన ప్రకటనలకు భిన్నమైన స్థితిగతులున్నాయని సైనికా ధికారులే మీడియాకు రహస్యంగా చెప్పటం అమెరికాలో కుప్పకూలుతున్న వ్యవస్థలకు ఆనవాలు. సోవియెట్ కనుమరుగయ్యే ముందు కూడా ఇలాంటి ధోరణులే కనబడ్డాయి.ఇతర దేశాల సహకారంతో హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ట్రంప్ చెప్పిన కొన్ని గంటలకే, అందుకు తాము అంగీకరించబోమని నాటో భాగస్వామ్య దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్‌లు ప్రకటించి గాలి తీశాయి. 'హోర్ముజ్ దిగ్బంధం' అంటూ చేసిన ప్రకటనకు అర్థం ఇరాన్ నౌకాశ్రయాల దిగ్బంధమని అమెరికా సైన్యం ఆ వెంటనే తెలిపింది. సోమవారం నుంచి అమల్లోకి వచ్చిందని కూడా ప్రకటించారు. కానీ గల్ఫ్ దేశాలే దీన్ని నిరసిస్తున్నాయి. ట్రంప్ చర్య ఈ ప్రాంతం మొత్తాన్ని శాశ్వతంగా యుద్ధ ఊబిలోకి దించేస్తుందని సౌదీ అరేబియాతోసహా చాలా దేశాలు ఆందోళనపడుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులు యుద్ధానికి ముందు మాదిరే రోజుకు 70 లక్షల బ్యారెళ్లకు చేరు కున్నాయి. అవి ఎర్ర సముద్రం గుండా వెళ్తున్నాయి. కానీ అమెరికా దుందుడుకు చర్యకు దిగితే యెమెన్‌లోని హౌతీలు ఆ ఎగుమతుల్ని దెబ్బతీస్తారు. తన నాయకత్వాన ఇన్ని దశాబ్దాలుగా సాగిన ఏకధ్రువ ప్రపంచం కళ్లముందు కుప్పకూలుతున్న వైనాన్ని అమెరికా గ్రహించకపోతే పోయిందిగానీ... చైనా నాయకత్వంలో కొత్త అమరిక మొగ్గతొడుగుతోందన్న సంగతైనా అది తెలుసుకోవాలి. ఈ యుద్ధం తనకూ, ఇరాన్‌కూ మధ్య పంచాయతీ కాదు. అది పశ్చిమాసియాకు పరిమిత మైంది అంతకన్నా కాదు. ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని క్రమేపీ బలహీనపరుస్తున్న ఒక నిరర్థక యుద్ధం. అది చైనా నాయకత్వాన కొత్త కూటమికి పురుడు పోస్తున్న ప్రమాదకర యుద్ధం. ఆర్థికంగా, సైనికంగా ప్రపంచంలోనే తాము సర్వశక్తిమంతులమని ఇరాన్‌తో చర్చలకు చాన్నాళ్లముందు జేడీ వాన్స్ అన్నారు. ట్రంప్ ప్రభావం ఆయనపై ఎక్కువే ఉన్నట్టుంది. ఆ దృశ్యం మారుతున్న సంగతిని అమెరికా నాయకత్వం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

## నీటి భద్రత కోసం 'జలధార'

**మొదటిపేజీ తరువాయి** - చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించారు.రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో 38 లోక్‌సభ, 263 అసెంబ్లీ స్థానాలు

**మొదటిపేజీ తరువాయి** - అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి 263కు, లోక్‌సభ స్థానాల సంఖ్య 25 నుంచి 38కి పెరిగే అవకాశం ఉంది. 2023లో ఆమోదం పొందిన 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ చట్టం)ను 2029 ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ సంస్కరణలను చేపట్టింది. ఈ బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందిన వెంటనే, నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది.ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, ఏపీలో 33 శాతం మహిళా రిజర్వేషన్ల ప్రకారం పెరిగిన అసెంబ్లీ స్థానాల్లో దాదాపు 87, లోక్‌సభ స్థానాల్లో 13 మహిళలకు కేటాయించబడతాయి. సీట్ల పెంపునకు అనుగుణంగా జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల సంఖ్య కూడా పెరగనుంది.

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు



**మొదటిపేజీ తరువాయి** - శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది.వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# 24ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు

**మొదటిపేజీ తరువాయి** - బంగాల్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తృణమూల్ కాంగ్రెస్ దోచుకున్న ప్రతి పైసాను వడ్డీతో సహా తిరిగి వసూలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. 24 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నప్పటికీ, ఆయనపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉత్తర బంగాల్‌లోని జల్పాయ్‌గుడి జిల్లా రాజ్‌గంజ్‌లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికారం నుంచి వైదొలగడం ఖాయం. ఆ ప్రక్రియను ప్రారంభించే బాధ్యత ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది. ప్రధాని మోదీ గుజరాత్‌లో 12 ఏళ్లు పాలించారు. కేంద్రంలో మరో 12 ఏళ్లుగా నాయకత్వం వహిస్తున్నారు. అయినా సరే ఒక్క రూపాయి అవినీతి ఆరోపణ కూడా ఎదుర్కోలేదు. బంగాల్‌లో బీజేపీని అధికారంలోకి తీసుకురండి. టీఎంసీ నాయకులు ప్రజల నుంచి దొంగలించిన ప్రతి పైసాను, వడ్డీతో సహా మేం తిరిగి రాబడతాం" అని అమిత్ షా తెలిపారు.బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీచర్ల నియామక స్కాంలో రూ.300 కోట్లు, ఉత్తర బంగాల్ వరద సహాయ నిధుల్లో రూ.100 కోట్లు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. ఉత్తర బంగాల్ మూడు 'టీ'లతో (టీ, టింబర్, టూరిజం) ప్రసిద్ధి చెందిందని, కానీ సీఎం మమతా నాలుగో టీగా బీజేపీ కార్యకర్తల కన్నీళ్లను జోడించారని



విమర్శించారు. ఉత్తర బంగాల్ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీ తోట కార్మికులకు భూ హక్కులు కల్పించి వారిని భూస్వాములుగా మారుస్తామని వెల్లడించారు. టీఎంసీ గూండాలను గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)లో కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, అప్పుడు బంగాల్ అంతటా ఎవరూ నాలుగు వివాహాలు చేసుకోలేరని అమిత్ షా తెలిపారు. తాము లవ్, ల్యాండ్ జిహాద్‌కు ముగింపు పలుకుతామని అన్నారు. అలాగే మహిళలకు ప్రతి నెలా రూ. 3 వేలు, నిరుద్యోగ యువతకు రూ. 3000 ఇస్తామని చెప్పారు. తల్లులు, సోదరీమణులు ప్రభుత్వ బస్సుల్లో టికెట్లు కొనాల్సిన అవసరం ఉండదు, వారు ఉచితంగా ప్రయాణించగలుగుతారని అన్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే డార్జిలింగ్‌లోని గూర్ఖాలాండ్ సమస్య పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా శాశ్వత పరిష్కారం చూపుతామని అమిత్ షా తెలిపారు. గతంలో జరిగిన హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో గూర్ఖా సోదరులపై వేల సంఖ్యలో తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని ఉపసంహరిస్తామని స్పష్టం చేశారు. గూర్ఖా సమస్య పరిష్కారం కోసం గతంలో దిల్లీలో నిర్వహించిన మూడు సమావేశాలకు మమతా హాజరు కాలేదని ఆరోపించారు. మధ్యవర్తిని నియమించినప్పటికీ ఆమె సహకరించలేదని విమర్శించారు. రాష్ట్రంలో చొరబాట్లు, గూండా రాజ్యం, మాఫియా వ్యవస్థకు ముగింపు పలుకుతామని పేర్కొన్నారు.బంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశ ఏప్రిల్ 23 కాగా, రెండో దశ 29న పోలింగ్ జరగనుంది. మే 24న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2021 బంగాల్ ఎన్నికల్లో టీఎంసీ 213 అసెంబ్లీ సీట్లు రాగా, బీజేపీకి 77 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి ఎలాగైనా అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తోంది. అటు టీఎంసీ కూడా అదే ప్రయత్నంలో ఉంది.

## భారత్‌లో తొలిసారి ముంబైలో పట్టాలెక్కనున్న నాన్ - ఏసీ క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు

**మొదటిపేజీ తరువాయి** - ఉన్న లోకల్ రైలును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. రద్దీగా ఉండే రైళ్ల నుంచి ప్రయాణికులు జారిపడి జరిగే ప్రమాదాలను నివారించడంతో పాటు తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం కల్పించడం ఈ కొత్త రైలు రూపకల్పన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.ప్రస్తుతం ముంబైలో కేవలం ఖరీదైన ఏసీ లోకల్ రైళ్లకు మాత్రమే ఆటోమేటిక్ క్లోజ్డ్ డోర్ వ్యవస్థ ఉంది. అయితే, సాధారణ తరగతి ప్రయాణికులకు కూడా ఏసీ రైళ్ల తరహా భద్రతను తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ఈ వినూత్న రైలును రూపొందించారు. ఇందులో ఏసీ లేనప్పటికీ, ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా 'ఫోర్స్డ్ వెంటిలేషన్ సిస్టమ్' అనే అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ వ్యవస్థ రైలు డోర్లు మూసి ఉన్నా కూడా కోచ్‌లలోకి నిరంతరం స్వచ్ఛమైన గాలిని పంపింగ్ చేస్తుంది. తద్వారా సాధారణ రైళ్ల కంటే ఎక్కువ గాలి ప్రసరణ జరిగి, లోపల వాతావరణం చల్లగా ఉంటుంది.ఈ సరికొత్త రైలు రేక్‌ను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో తయారు చేశారు. త్వరలోనే ముంబై సబర్బన్ ట్రాక్‌లపై దీని ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇందులో మరిన్ని ఆధునిక సదుపాయాలు కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో గార్డు లేదా మోటార్‌మ్యాన్‌తో మాట్లాడేందుకు 'టాక్-బ్యాక్' సిస్టమ్, మెరుగైన సీటింగ్ అమరిక, ఎల్ఈడీ లైటింగ్, రాబోయే స్టేషన్ల వివరాలను ప్రదర్శించే జీపీఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి.ఈ రైలు టికెట్ ధరలపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఏసీ లోకల్ రైలు ఛార్జీల కంటే గణనీయంగా తక్కువగా, సాధారణ ఫస్ట్ క్లాస్ లేదా సెకండ్ క్లాస్ ధరలకు దగ్గరగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ట్రయల్స్





విజయవంతమైతే, ముంబై రైల్వే నెట్‌వర్క్‌ను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఇలాంటి మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే బోర్డు యోచిస్తోంది.

## ఏపీ ఇంటర్ ఫలితాల విడుదల,12 ఏళ్లలోఎన్నడూ లేనంతగా ఉత్తీర్ణత!

**మొదటిపేజీ తరువాయి** - ఆంధ్రప్రదేశ్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. గడిచిన 12 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు.ఈ ఏడాది సుమారు 10.50 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారని లోకేశ్ తెలిపారు. గత 12 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది అత్యధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఫస్టియర్లో 77 శాతం మంది విద్యార్థులు (3,61,526) పాసవ్వగా.. సెకండియర్లో 81 శాతం మంది విద్యార్థులు (3,59,816) ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. ఫస్టియర్లో బాలురు 72 శాతం, బాలికలు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్లో బాలురు 76 శాతం, బాలికలు 85 శాతం




పాసయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో ఫస్టియర్ లో 61%, సెకండియర్ లో 74% మంది పాసయ్యారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా తొలి ఏడాది 54 శాతం మంది, ద్వితీయ సంవత్సరం 68 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని లోకేశ్ కితాబునిచ్చారు. ఇది విద్యార్థులు, ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్ల కష్టానికి ఫలితమని కొనియాడారు.

ఫలితాలను చెక్ చేసుకునే విధానం:

వెబ్‌సైట్: విద్యార్థులు resultsbie.ap.gov.inలో తమ హాల్ టికెట్ నంబర్ ద్వారా ఫలితాలు పొందవచ్చు.

వాట్సప్: 9552300009 నంబర్‌కు 'హి' అని మెసేజ్ పంపి, హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేస్తే నేరుగా రిజల్ట్ వాట్సప్‌కే వస్తుంది.

ఫలితాల విడుదల సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని, సప్లిమెంటరీ పరీక్షల్లో పట్టుదలతో చదివి పాస్ కావాలని సూచించారు. ఈ సమయంలో తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు మానసిక మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు.


# దక్షిణాదికి అన్యాయం జరిగితే తీవ్ర పోరాటం తప్పదు

**మొదటిపేజీ తరువాయి** - దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనను అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లులను రేపటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే 2029 సాధారణ ఎన్నికల నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాలు సమూలంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించేలా ఈ ప్రక్రియ జరిగితే, అది దేశవ్యాప్త ప్రజా ఉద్యమానికి దారి తీస్తుందని ఆయన స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ పాటించి, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న దక్షిణ రాష్ట్రాలకు ఈ పునర్విభజన శాపంగా మారకూడదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని ప్రోత్సహించాల్సింది పోయి, ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు.డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి సీట్లు తగ్గితే, అది కేవలం రాజకీయ ప్రక్రియగా మిగిలిపోదని... మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక తీవ్రమైన ప్రజా పోరాటానికి నాంది పలుకుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ గత మూడేళ్లుగా తీసుకున్న స్టాండ్‌కే కట్టుబడి ఉందని, ఇందులో ఎలాంటి మార్పు లేదని తెలిపారు.తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నామని పేర్కొంటూ... పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని అణచివేయాలని చూస్తే నిశ్శబ్దంగా ఉండబోమని హెచ్చరించారు. ఢిల్లీ పాలకులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని,



దక్షిణాది ప్రజల హక్కుల విషయంలో బుద్ధిగా వ్యవహరించాలని ఆయన తన సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం



**మొదటిపేజీ తరువాయి** - పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు



**మొదటిపేజీ తరువాయి** - రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు.చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ప్రజా మంటలు

గురువారం 16 - 04 - 2026

# ఏప్రిల్ 17న నల్ల బ్యాడ్జీల ధర్నా

## కరీంనగర్‌లో ఉద్యోగ జేఏసీ



**కరీంనగర్, ఏప్రిల్ 15 (ప్రజా మంటలు):** జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్రా మిశ్రా గారిని ఉద్యోగ జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, ఏప్రిల్ 17న నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి అనుమతి కోరారు.ఈ రోజు స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో, ఏప్రిల్ 17న తేదీ మధ్యాహ్నం 1 గంటలకు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించనున్నట్లు జేఏసీ ప్రతినిధులు తెలియజేశారు.ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ నిరసన కార్యక్రమం వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవస్థ సజావుగా నడవడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ప్రకృతి వైపరీత్యాలు, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, శాంతిభద్రతలు, నీటి సరఫరా, శానిటేషన్, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలు వంటి అన్ని రంగాల్లో ఉద్యోగులే ప్రధాన భూమిక పోషిస్తున్నారని అన్నారు.అయితే ప్రస్తుతం ఉద్యోగులు తమ న్యాయమైన హక్కులు అయిన డీఏ, ఇంక్రిమెంట్లు, పీఆర్సీ, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి ఉపకారాలు కాకుండా ఉద్యోగుల హక్కులేనని ఆయన స్పష్టం చేశారు.ఉద్యోగుల జీతభత్యాల నుంచి 15% మొత్తాన్ని తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేయడాన్ని స్వాగతించినప్పటికీ, వృద్ధ తల్లిదండ్రులకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే సరిపోదని, వారిని ప్రత్యక్షంగా చూసుకునే అవకాశాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బదిలీల కారణంగా ఉద్యోగులు కుటుంబాల నుంచి దూరమవుతూ ఇబ్బందులు పడుతున్నారని, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.కాబట్టి వృద్ధ తల్లిదండ్రులు ఉన్న ఉద్యోగులను వారి స్వంత జిల్లాల్లోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, బదిలీలలో సడలింపులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇది ఉపకారం కాదని, మానవతా బాధ్యత అని అన్నారు.అలాగే, 3035 సంవత్సరాలు సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులు తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.చివరగా "ఉద్యోగి బలంగా ఉంటే ప్రభుత్వం బలంగా ఉంటుంది ప్రభుత్వం బలంగా ఉంటే ప్రజాసంక్షేమం సాఫల్యం అవుతుంది" అనే సందేశంతో ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి కటకం రమేష్, పెండ్యాల కేశవ రెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు సుంకిశాల ప్రభాకర్ రావు, చకినాల రామ్మోహన్, జాలి మహేందర్ రెడ్డి, చంద్రమౌళి, చింతపల్లి అశోకరావు, ఎండి సలీం, దోనికేన సునీల్ కుమార్, గడ్డం సుధాకర్, డాక్టర్ అరవింద్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, కిరణ్ కుమార్, కోట రామస్వామి, శంకర్, గూడ ప్రభాకర్ రెడ్డి, మారుపాక రాజేష్, భరద్వాజ్, వెలిచాల సుమంతరావు, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమం





సేవ్యాలలో ఎస్పీ ఆదేశాల మేరకు బుగ్గారం మండలం కేంద్రంలో శ్రీ గ్లోబల్ హై స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతర ఏఎస్ఐ,సతీష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్థానిక నాయకులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, మిత వేగం పాటించడం వంటి ముఖ్యమైన అంశాలను వివరించారు.కార్యక్రమం సందర్భంగా విద్యార్థులలో చైతన్యం పెంపొందించేందుకు వ్యాసరచన మరియు లేఖారచన పోటీలు నిర్వహించబడినాయి. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ, జి సతీష్ పిలుపునిచ్చారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

### పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



**సికింద్రాబాద్, ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని చాచా నెహ్రూ నగర్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ డివిజన్ అధ్యక్షులు మహేష్ రామంచ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాజ సేవలో నిరంతరం శ్రమిస్తున్న సుమారు 60 మంది పారిశుద్ధ్య కార్మికులను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర టీచర్ సెల్ కో-కన్వీనర్ శివరామకృష్ణ, అంబేద్కర్ ఉత్సవ కమిటీ జిల్లా కో-కన్వీనర్ ఎస్. రాజు మాట్లాడుతూ... అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగానే సమాజంలోని అట్టడుగు వర్గాలకు, కార్మికులకు గౌరవం అందించేలా ఈ సన్మాన కార్యక్రమం చేపట్టామన్నారు. మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వై. సురేష్, కేఎం కృష్ణ, కె. కృష్ణ, ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్, అంగముత్తు శ్రీనివాస్, ఆర్. సత్యనారాయణ, కురుమ శంకర్, శ్రీకాంత్, నైనేష్, ఏ. గణేష్, డి. అరుణ్, లక్ష్మణ్, స్వప్నిక, రాజ్యలక్ష్మి, నరేందర్, వెంకటపతి రాజు మరియు ప్రధాన కార్యదర్శి బంధం కిరణ్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## జగిత్యాల మున్సిపల్ అభివృద్ధి విషయంలో ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల ఏప్రిల్ 15 ( ప్రజా మంటలు)** :జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మున్సిపల్ అభివృధి విషయంలో ప్రిన్సిపాల్ సెక్రెటరీ (సి డి ఎం)శ్రీమతి శ్రీదేవి ని కలిసి యు ఐ డి ఎఫ్ ఫండ్స్ లో విదివిదానాలగురించి మరియు అందులో ఉన్న జాప్యలగురించి మరియు జగిత్యాల మున్సిపల్ లో సిబ్బంది కోరుత ఉందని కోరగా సానుకూలంగా స్పందించిన శ్రీదేవి తొందర్లోనే వీటన్నిటికి పరిష్కారం చూపిస్తామని అన్నారు.తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి జగిత్యాల లో జరుగుతున్న వివిధ రాజకీయ పరిణామాల గురించి కూడా చర్చించి మరియు జగిత్యాల లో వివిధ అభివృద్ధి పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కోరగా వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.తొందర్లోనే జగిత్యాల నియోజకవర్గానికి వస్తానని చెప్పడం జరిగింది..సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కి మరియు ప్రిన్సిపాల్ సెక్రెటరీ సి డి ఎం శ్రీదేవికి జగిత్యాల నియోజకవర్గం మరియు ప్రజల పట్ల శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది..

## ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో విద్యా కుసుమానికి అభినందనల వెల్లువ



**ఎల్కతుర్తి ఏప్రిల్ 15 ప్రజా మంటలు** :తాజాగా విడుదలైన ఇంటర్ ఫలితాలలో మెరిసిన విద్యా కుసుమం హింగే లక్కీకి అభినందనలు వెల్లువెత్తాయి. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించిన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన హింగే భాస్కర్ కూతురు హింగే లక్కీని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకన్న అభినందించారు.లక్కీని శాలువాతో సత్కరించి.. పూల బొకే అందజేసి దీవించారు. భవిష్యత్తులో మరింతగా రాణించి ఉన్నత స్థానాలకు వెళ్లాలని శుభాశీస్సులు అందజేశారు. విద్యలో రాణించి తనతో పాటు కళాశాలకూ పేరు సంపాదించి పెట్టిన లక్కీకి గౌతమ్ కాలేజీ డైరెక్టర్ అంబీరు శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. చక్కటి విద్యను అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న గౌతమ్ కాలేజీ యాజమాన్యాన్ని నాగూర్ల వెంకన్న అభినందించారు. మోటె చిరంజీవి, టెంకు రాల శ్రీధర్, రమేష్ తదితరులు లక్కీకి శుభాకాంక్షలు తెలిపారు.

## టీటీడీ శ్రీ ధ్యాన మందిరంలో వివిధ సత్సంగ సభ్యులచే భజనలు



**జగిత్యాల ఏప్రిల్ 15 ( ప్రజా మంటలు) :** ఉగాది పండుగ, శ్రీరామనవమి,ఘనంగా జరుపుకున్న సందర్భం పురస్కరించుకొని, స్థానిక రామ మందిరంలో అఖిల బ్రాహ్మణ సేవా సంఘం వారు పట్టణంలోని వివిధ సత్సంగాల సభ్యులచే, భజనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానంతరం వచ్చిన భక్తులందరికీ బ్రాహ్మణ సేవా సంఘం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆకుబత్తిని(గౌరి) శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈనాటి గానామృతం కార్యక్రమంలో పాల్గొన్న గాయని, గాయకులు, బొంతపల్లి వినోద్, కిష్టంపేట రమేష్ రెడ్డి, సంతూర్ శ్రీనివాస్, కోటగిరి శ్రవణ్ కుమార్, యాదగిరి మారుతీరావు, సామాజిక కార్యకర్త, తవుటురాంచంద్రం,కోటగిరి కళ, యాదగిరి స్వర్ణ, తవుటు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆదేశాలకు స్పందించిన ఎస్సారెస్పీ అధికారులు



**గొల్లపల్లి ఏప్రిల్ 15 ప్రజా మంటలు** : గొల్లపల్లి మండలం లోని ఇబ్రహీంపట్నంలో విజిట్ లో భాగంగా ఎస్సారెస్పీకినాలు లో చెత్త చదరం తో పూడికతో నుండి ఉందని నాలుగు రోజుల క్రితం మంత్రి దృష్టికి తీసుకెళ్లడం తో వెంటనే మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశించడంతో స్పందించిన అధికారులు బుధవారం ఎస్సాఎస్పీ ఈఈ ఖాన్ అఫ్జల్ డిఇ,వందన,ఏఇ, ప్రదీప్,సర్వ నిర్వహించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి ఉప సర్పంచ్ మాజీ ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



**జగిత్యాల ఏప్రిల్ 15 ( ప్రజా మంటలు) :** టీజీఈజేఏసి జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశ17 ఏప్రిల్ న మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన.రాష్ట్ర జేఏసీ సూచనల మేరకు టీజీఈజేఏసి జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశం జేఏసీ జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి మరియు జిల్లా కన్వీనర్ కందుకూరి రవి బాబు గార్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఇట్టి కార్యక్రమానికి ఉద్యోగ,గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ,కార్మిక పెన్షనర్స్ మరియు క్లాస్ ఫోర్, ఔట్సోర్సింగ్ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు, జిల్లా నాయకులు పాల్గొన్నారుతెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక & పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి కార్యనిర్వాహక సమావేశం (తేది: 07-04-2026)లో తీసుకున్న తీర్మానాల మేరకు, టి జి ఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ శ్రీ మారం జగదీశ్వర్ మరియు సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు... రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేయుటలో భాగంగా... తేదీ:17.4.2026 (శుక్రవారం) రోజున మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లా కేంద్రం లో కలెక్టరేట్ సమావేశ మందిరం ఎదుట, డివిజన్ మరియు అన్ని మండల కేంద్రాలలో టి జిఈ జె ఎ సి జగిత్యాల జిల్లా పక్షాన భోజన విరామ సమయంలో జేఏసీ సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టుగా తెలిపారు ఇట్టి సమావేశంలో వీరితోపాటు టి జి ఈ ఏ సి జిల్లా కో చైర్మన్లు ఎండి.వకీల్, మామిడి రమేష్, ఊకంటి అమరేందర్ రెడ్డి, పి ఆర్ టి యు యాల్ల అమరనాథ్ రెడ్డి, ఎస్ టి యు భైరం హరికిరణ్, టి ఆర్ టి ఎఫ్ తుంగూరి సురేష్, డిటిఎఫ్ ఎన్నం రాంరెడ్డి, వివిధ సంఘాల జిల్లా నాయకులు సాహెద్ బాబు, గుర్రం శ్రీనివాస్ గౌడ్, హన్మంత రెడ్డి, చంద్ర శేఖర్, సుగుణాకర్, రాజశేఖర్, మధుకర్, హఫీజ్, శ్రీనివాస్, అరుణ, మధుసూదన్, మల్లయ్య, నగేష్, అక్షయ్, సుజాత లక్ష్మి, మాధవి, రహీం, గణేష్, సత్తయ్య, గంగాధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నిధుల విడుదల లేక అల్లాడుతున్న ఈఎస్ఐ ఆసుపత్రులు

### ఔషధ సరఫరాదారుల ఆవేదన




**సికింద్రాబాద్, ఏప్రిల్ 15 ( ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీలకు మందులు, సర్జికల్ సామాగ్రిని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు కొండలా పేరుకుపోయాయి. సుమారు 2024 నుంచి ఈ చెల్లింపులు పెండింగ్‌లో ఉండటంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి కి తమ గోడును వినిపిస్తూ అసోసియేషన్ ప్రతినిధులు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే సెక్రటేరియట్ లోని సంబంధిత శాఖ ఉన్నత అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ప్రభుత్వం కేవలం మందుల బిల్లులను మాత్రమే పాక్షికంగా విడుదల చేస్తూ, సర్జికల్ , దయాగ్నస్టిక్ బిల్లులను ఏళ్ల తరబడి నిలిపివేయడంపై వారు విస్మయం వ్యక్తం చేశారు. రోగికి చికిత్స అందించడంలో మందులతో పాటు సిరంజీలు, డయాగ్నస్టిక్ పరీక్షలు, గాజు బట్టలు వంటివి అత్యవసరమని, వీటి సరఫరా నిలిచిపోతే వైద్య వ్యవస్థ కుప్పకూలుతుందని వారు హెచ్చరించారు. ఈఎస్ఐ కార్పొరేషన్ నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఖర్చుల డేటా సమర్పించకపోవడం వల్ల నిలిచిపోతున్నాయని, ఫలితంగా సుమారు రూ. 5.5 కోట్ల సర్జికల్ బిల్లులు 2024 నుండి పెండింగ్‌లోనే ఉన్నాయని వారు వివరించారు.మరోవైపు గతేడాది పిలిచిన టెండర్లు నేటికీ ఖరారు కాకపోవడంతో సరఫరాదారులు అయోమయంలో ఉన్నారు. నిబంధనల ప్రకారం 90 రోజుల్లోగా పూర్తి కావాల్సిన టెండర్ ప్రక్రియ 180 రోజులు దాటినా కొలిక్కి రాలేదని, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ధరలు భారీగా పెరిగినందున పాత ధరలకు సరఫరా చేయడం అసాధ్యమని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయడంతో పాటు, పారదర్శకమైన కొత్త టెండర్లను పిలవాలని అసోసియేషన్ ప్రెసిడెంట్ రామచంద్రం డిమాండ్ చేశారు.

## పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ వ్యతిరేకంగా రైతుల ఆందోళన

### వికారాబాద్‌లో కవిత అరెస్ట్ - పోలీసుల చర్యలపై విమర్శలు.






**వికారాబాద్, ఏప్రిల్ 15 (ప్రజా మంటలు):** పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ వికారాబాద్‌లో రైతులు, తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎండలో కూర్చొని ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో పాల్గొన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ నేత విశారదన్ మహారాజ్‌తో కలిసి రైతులకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా పోలీసులుతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో కవితను పోలీసులు అరెస్ట్ చేసి బంటారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.పరిశ్రమల పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను లాక్కుంటున్నారని కవిత విమర్శించారు. కల్లాపూర్, రాపోల్, భట్ల చందారం గ్రామాల్లో రైతుల భూములు స్వాధీనం చేసుకుంటున్నారని, దాదాపు 1200 ఎకరాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అందులో ఎక్కువ భాగం అసైన్డ్ భూములేనని, మిగతా భూములు కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులవేనని తెలిపారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, కొందరికి మద్దతు ధర లేదని, మరికొందరికి రుణమాఫీ జరగలేదని, ఎక్కడ చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని అన్నారు. పరిశ్రమల వల్ల స్థానికులకు ఉద్యోగాలు కూడా దక్కడం లేదని ఆరోపించారు.రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన కవిత, స్వయంగా గ్రామాలకు వెళ్లి రైతుల బాధలు తెలుసుకోవాలని కోరారు. అయితే స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఆందోళన కొనసాగుతుందని తెలిపారు.ధర్నా సమయంలో జర్నలిస్టులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు వచ్చాయి. కెమెరాలు లాక్కొని నెట్టేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి.భూసేకరణను నిలిపివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆందోళనకారులు స్పష్టం చేశారు.

## అమర్‌నాథ్‌యాత్రికులకు18 నుంచి గాంధీలో వైద్య పరీక్షలు

### ఫిట్ నెస్ సర్టిఫికెట్లు జారీ



**సికింద్రాబాద్, ఏప్రిల్ 15 ( ప్రజామంటలు):** ఈ ఏడాది అమర్ నాథ్ యాత్రకు సంబందించిన వివరాలు వచ్చేశాయి. మంచులింగాకారంలో కొలువుదీరిన శివుడిని దర్శించుకునేందుకు అమర్‌నాథ్‌యాత్రకు వెళ్లే భక్తులకు అవసరమైన మెడికల్‌సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ ఈ నెల 18వ తేదీ శనివారం నుంచి సికింద్రాబాద్‌గాంధీ ఆస్పత్రిలో ప్రారంభిస్తున్నారు. జూలై 3 నుంచి ఆగస్టు తేదీ వరకు జరిగే అమర్ నాథ్ యాత్రకు సంబంధించి యాత్రికులు తప్పనిసరిగా సంబంధిత వైద్యులు ఇచ్చే ఫిట్‌నెస్‌సర్టిఫికెట్‌ను ఖచ్చితంగా సమర్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక మెడికల్ బోర్డును ఏర్పాటు చేసింది. ఈ మేరకు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ప్రొఫెసర్‌వాణి వివరాలను తెలిపారు. ఆన్లైన్ లో అమర్ నాథ్ యాత్ర ఫిట్నెస్ సర్టిఫికెట్ దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకొని, దానిలో వివరాలు రాయాల్సి ఉంటుంది. అలాగే పలు వైద్య పరీక్షలను చేయించుకొని, రిపోర్టులు సమర్పించాల్సి ఉంటుంది. తొలి విడదత గా శనివారం ప్రారంభమయ్యే ఈ ప్రక్రియ, ఆపై ప్రతి శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి కొనసాగుతుందని, మెడికల్ బోర్డు ద్వారా యాత్రికులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.భక్తుల సౌకర్యార్థం జనరల్‌మెడిసిన్, ఆర్థోపెడిక్, ఫల్మనాలజీ, కార్డియాలజీ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు డాక్టర్‌మురళీకృష్ణ, హారిక, గోపికృష్ణ, శ్రీనివాస్, నోడల్‌ఆఫీసర్‌యోగేందర్‌లతో కూడిన ప్రత్యేక బోర్డు యాత్రికుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించనుంది. అత్యంత క్లిష్టమైన అమర్‌నాథ్‌యాత్రకు వెళ్లే వారు శారీరకంగా ధృడంగా ఉన్నారో లేదో పరీక్షించి, అర్హులైన వారికి తక్షణమే ధృవీకరణ పత్రాలు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. యాత్రకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.

## అన్న ప్రసన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా





**గొల్లపల్లి ఏప్రిల్ 15 ప్రజా మంటలు :** గొల్లపెల్లి శ్రీ రాములపల్లి సెక్టర్ లోని దట్నూర్,నందిపల్లె అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు పిల్లల యొక్క ఎత్తు,బరువు,జబ్బ చుట్టూ కొలత తీసి వారి యొక్క పోషణ స్థితిని తల్లులకు వివరించారు ఎదిగే పిల్లలకి పోషక పోషక విలువలతో కూడిన ఆహారం అవసరమని సమతుల ఆహారం గురించి రోజు తినే ఆహారంలో భాగంగా చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేర్చుకోవాలని వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో, దట్నూర్ నందిపల్లె సర్పంచ్లు ఈర్నాల విజయ,బెక్కం గంగారం ,సూపర్వైజర్ జానకి, జ్యోతి, అంగన్వాడి టీచర్ సరోజన,రజిత,మంజుల,ఆశా వరక్కర్లు ,గర్భిణీ బాలింతరు చిన్న పిల్లల తల్లులు తదితరులు ఆయాలు పాల్గొన్నారు.

## బి.ఆర్.ఎస్ బహిరంగ సభ విజయవంతం చేయండి





**జగిత్యాల ఏప్రిల్ 15 ( ప్రజా మంటలు)** :జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈనెల 20వ తేదీన కేసీఆర్ బహిరంగ సభ గురించి సన్నాహక సమావేశంలో పాల్గొన్న జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఎమ్మెల్సీ ఎల్ రమణ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ మరియు మాజీ మార్కెట్ చైర్మన్ లోక బాపు రెడ్డిఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఈనెల 20వ తేదీన కేసీఆర్ సమక్షంలో చేరుతున్న సందర్భంగా కెసిఆర్ భారీ బహిరంగ సభకు నాయకులు అభిమానులు కార్యకర్తలు ప్రతి గ్రామం నుండి మరియు పట్టణం నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని అన్నారు. మళ్లీ బిఆర్ఎస్ పార్టీ జైత్రయాత్ర జగిత్యాల నుండి ప్రారంభమవుతుందని అన్నారు. తెలంగాణలోని ప్రజలందరూ రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలని అంటున్నారని అన్నారు. నాయకులు కార్యకర్తలు అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎలక్షన్లో కేసీఆర్ ని మళ్లీ తిరిగి ముఖ్యమంత్రి చేసుకునే వరకు అందరం కష్టపడి పని చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ మండల అధ్యక్షులు కౌన్సిలర్లు సర్పంచ్లు సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం





**జగిత్యాల ఏప్రిల్ 15(ప్రజా మంటలు)** :అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విస్తృత రోడ్డు భద్రత అవగాహనచిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అలవరచుకోవడం ద్వారా బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చనే లక్ష్యంతో "ఆ రైవు ఆలైవ్ కార్యక్రమం కింద జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మూడవ రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ద్వారా తల్లిదండ్రుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు "డియర్ పేరెంట్స్, ప్లీజ్ బై ఏ హెల్మెట్ ఫర్ మీ అండ్ మామ్" అనే సందేశంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం వంటి అలవాట్లు నిత్యజీవితంలో పాటించాలని సూచించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమాల పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి తెలంగాణ సాహితి శిఖరం మలయశ్రీ

చిల్ల మల్లేశం,సీనియర్ జర్నలిస్టు.

## ప్రముఖ కవి, రచయిత, భౌతికవాది

## డాక్టర్ మలయశ్రీ (1940 -10 ఏప్రిల్ 2026)

బ్రెయిన్ స్ట్రోక్ తో కరీంనగర్లో శుక్రవారం కన్నుమూశారు. ఆయన మృతితో తెలుగు సమాజం ఒక గొప్ప సాహితీవేత్తను, సృజనశీలిని, చరిత్రకారుడిని, అంతకు మించి గొప్ప పరిశోధకుడిని కోల్పోయినట్లయింది. మలయశ్రీ తనను తాను 'మనిషి కవి' గా ప్రకటించుకున్నారు.'వస్తుతః ఆయన హేతువాది..బౌద్ధ తాత్త్వికానుయాయి.. అతీత శక్తులను విశ్వసించని తార్కికుడు.. వెరసి అక్షరాలా అచ్చమైన మానవతావాది..' అంటారు సినారె. మలయశ్రీ సృజనకు అంచనా వేయలేనన్ని అంచులున్నాయంటారాయన. అందుకు తగినట్లే.. కవిత్వం, కథ, నాటకం, నవల, మినీ కవిత, బాల గీతావళి, అనువాదం, చరిత్ర, విమర్శ, వ్యాసరచన.. ఇలా విభిన్న ప్రక్రియల్లో మలయశ్రీ సాహితీ సృజన చేశారు. ఆయన కలం నుంచి ఇప్పటివరకు 26 పద్య, గేయ కావ్యాలు, 12 నవలలు, 6 సీరియళ్లు, 20 బాల సాహిత్య పుస్తకాలు, 20 వయోజన విద్య పుస్తకాలు, 5 నాటకాలు, ఇంకా పలు చరిత్ర పరిశోధన గ్రంథాలు, అనువాదాలు వెలువడ్డాయి. మొత్తం 150 దాకా పుస్తకాలతో రాశిలోనూ , వాసిలోనూ మెప్పించడం మలయశ్రీ కే చెల్లింది.

### అసలు పేరు మల్లయ్య..

1940 లో కరీంనగర్ జిల్లా చెంజెర్లలో జన్మించిన మలయశ్రీ అసలు పేరు సంగని మల్లయ్య. ఆయన భార్య పేరు భారతీదేవి. కొంతకాలం కిందే ఆమె కన్నుమూశారు. వీరికి ఇద్దరు పిల్లలు. తెలుగు ఉపాధ్యాయుడిగా విద్యారంగంలో విశేష సేవలందించిన మలయశ్రీ, లెక్చరర్గా పదవీ విరమణ పొందాక తన జీవితాన్ని పూర్తిగా సాహితీసేవకే అంకితం చేశారు. 1968లో 'కావ్యసుందరి' మొదలు ఆయన కలం నుంచి అనేక పుస్తకాలు వెల్లువెత్తాయి. 1997లో వచ్చిన మలయశ్రీ వీహెచ్డీ గ్రంథం 'కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర..' పరిశోధన గ్రంథాల్లో కలికితురాయిగా నిలిచింది. 1975లో వెలువడిన 'శాంతి పథం' నాటకం కొంతకాలం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకంగా ఉంది. 1982లో వచ్చిన 'తిరుగుబాటు' నవల (విశాలాంధ్ర), 1987లో వచ్చిన మానవగీత ,1991లో వచ్చిన 'తెలుగులో లేఖా సాహిత్యం' ( తెలుగు అకాడమీ), 1995లో వచ్చిన 'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర' (శాతవాహన, కాకతీయ విశ్వవిద్యాలయాల ఎంఏ తెలుగు పాఠ్యగ్రంథం 2014), 1989 కాకతీయ కాలంనాటి సామాజికజీవితం, 1997లో వచ్చిన వజ్రసూచి( సంస్కృతానువాదం), 2006లో వచ్చిన 'పాల మనసులు' (రాష్ట్ర బాల కార్మిక నిర్మూలన సంస్థ ప్రచురణ), 1998లో వచ్చిన నిజమైన బౌద్ధం (వ్యాసాలు), 2003 లో వచ్చిన ప్రజాకవి వేమన (నాటకం), 2010లో వచ్చిన తెలంగాణ చరిత్ర-సంస్కృతి, జన జీవనం (2010) మలయశ్రీకి గొప్ప పేరుతెచ్చిపెట్టాయి. ఇటీవల ఆయన అందించిన 'తొలి తెలుగు చక్రవర్తులు' అనే నాటకాలు చరిత్ర రచనలో కొత్త ఒరవడిగా చెప్పుకోవచ్చు. చరిత్రను కేవలం రాజులు, యుద్ధాలు, జయాపజయాలకే పరిమితం చేయకుండా.. ఆనాటి కాల, మాన పరిస్థితులతో కలిపి అధ్యయనం చేసే అవకాశం మనకు కల్పించారు.

### తెలుగుకు ప్రాచీన హోదా మలయశ్రీ ఘనతే..

తెలుగు భాషకు ప్రాచీన హోదా దక్కడంలో మలయశ్రీ పరిశోధన కీలకంగా నిలిచింది. కరీంనగర్ జిల్లా కురిక్యాల గుట్టపై కనుగొన్న జినవల్లభుని శాసనంలో ఉన్నవి తొలి తెలుగు కంద పద్యాలని ఆయన తేల్చారు. ఇందుకోసం ఆ కంద పద్యాల్లోని పద పరిణామక్రమాన్ని శోధించి క్రీ.శ. 946 లోనే తెలుగు భాషలో ఈ స్థాయి సాహిత్యం ఉన్నట్లు నిరూపించారు. మన తెలుగుకు ప్రాచీన హోదా రాకుండా ఎప్పటి నుంచో అడ్డుకుంటున్న తమిళులకు మలయశ్రీ పరిశోధన చెంపపెట్టుగా మారింది. విమర్శకులు నోళ్లు మూసుకోవడంతో కేంద్రం అనివార్యంగా తెలుగుకు ప్రాచీన హోదా కట్టబెట్టింది. బుద్ధుని సమకాలీనుడుగా భావించే బావరి ముని నివాసమున్నది గోదావరి తీరాన గల బాదనకుర్తి అని మలయశ్రీ నిరూపించారు. కరీంనగర్ జిల్లా కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, ఇక్కడ సిరిముఖ, సిరిశాతవాహనుల నాణేలు లభించడమే ఇందుకు కారణమని గట్టిగా వాదించిన వారిలో మలయశ్రీ ఒకరు. అటు సాహిత్యం ద్వారా తెలంగాణ సామాజిక చరిత్రను మలయశ్రీ సాధికారంగా చెప్పారు. 'తెలుంగు గణం' నుంచి తెలంగాణ పుడితే, ఆంధ్ర అనేది 'జాతి' పదమని మలయశ్రీ అభిప్రాయం. మేఘసందేశంలో కాలిదాసు పేర్కొన్న యక్షుడు నివసించిన రామగిరి, ప్రస్తుత పెద్దపల్లి, మంథని మార్గంలో ఉన్న రామగిరే అని మలయశ్రీ అంచనా. అష్టదిగ్గజాలకు పూర్వీకుడైన 'చరిగొండ ధర్మన' కరీంనగరుకు చెందిన ధర్మపురివాసి అని మలయశ్రీ రుజువు చేశారు. నారాయణ శతకకర్త వెలిగందుల నారయ అని నిరూపించిందీ మలయశ్రీనే. పల్నాటి యుద్ధంలో బ్రహ్మనాయుడిని ఎదురించిన నాగమ్మ స్వగ్రామం కరీంనగర్ జిల్లాలోని ఆర్వెల్లి అని అప్పటికే ప్రచారంలో ఉండగా, అందుకు మలయశ్రీ పలు రుజువులు ఇచ్చారు. ఆమె నాగమ్మ కాదని, బల్మూరి కొండన్న కథలోని నాయకురాలు అని కొందరు వక్రీకరించే ప్రయత్నం చేయగా, మానాల బల్మూరి వెలమల నుంచి ఇప్పటికీ ఆర్వెల్లి ఉత్సవాలకు సారె వస్తుండడాన్ని బట్టి ఈమె నాగమ్మ అని కుండబద్దలు కొట్టారు. బతుకమ్మ పుట్టుక గురించి, సమ్మక్క పుట్టినూరి గురించి మలయశ్రీ చేసిన సూత్రీకరణలు మిగిలిన రచయితలకు భిన్నంగా, వాస్తవాలకు దగ్గరగా ఉంటాయి.

### బౌద్ధ, జైన ఆనవాళ్లపై పరిశోధన..

తెలంగాణలోని బౌద్ధ, జైన ఆనవాళ్లపై మలయశ్రీ విశేష కృషి చేశారు. బావరి శిష్యులు అశ్మక దేశ గోదావరి తీర వాసులు.(బుద్ధునితో సంభాషణసుత్తనిపాత -పారాయణ వగ్గ ), మగధ రాజు బింబిసారుని సమక్షంలో ఆంధ్రనటుల మహాబోధి నాటక ప్రదర్శన( లలిత విస్తర గాథ), బుద్ధుని శిష్యుడు మహాకాత్యాయనుడు అశ్మక రాజుకు బౌద్ధ ధర్మదీక్ష ఇవ్వడం(విమానవత్తు), అశ్మక రాజధాని పోతలి -(బోధన్), బుద్ధుని శిష్యుడు కొండన(కొండన్న తెలుగు వ్యక్తి).. ఇలాంటి ఎన్నో వివరణలు మలయశ్రీ మనకు అందించివెళ్లారు. జైన, జైనత్(జైనథ్), జనగాం(జైన గ్రామం), వర్ధన్న పేట(వర్ధమాన మహావీరుడు) పేరిట వెలిసిన గ్రామాలు. పశ్చిమాభిముఖంగా ఉన్న వేములవాడలోని బద్ది పోచమ్మ, హనుమకొండలోని సిద్ధేశ్వర, భద్రకాళి, పద్మాక్షి , జిన వల్లభుని కురిక్యాల శాసనం లాంటివన్నీ జైన ఆనవాళ్లుగా మలయశ్రీ పేర్కొంటారు.

### అనువాదంలో మేటి..

అనువాద రంగంలో మలయశ్రీ ఆరితేరిన రచయిత. ఆయనకు తన మాతృభాష తెలుగుతోపాటు సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్ , తమిళం, కన్నడం, మరాఠీలో మంచి ప్రావీణ్యం ఉంది. మలయశ్రీ సంస్కృతంలో కవిత్వం రాయడాన్ని చూసి చాలామంది ఆశ్చర్యపోయారు. అశ్వఘోషుని 'వజ్ర సూచి'ని మలయశ్రీ తెలుగులోకి అనువదించారు. కాళిదాసు మేఘసందేశం కావ్యాన్ని 'యక్ష సందేశం' పేరుతో తెనుగీకరించారు. బౌద్ధుల ధర్మపదమును తెలుగులోకి పద్యానువాదం చేశారు. సంస్కృతంలో 'మానవగీత' రచించారు. మధ్యయుగాల్లో సంస్కృత భాషను బ్రాహ్మణ మతవాదులు తమ వర్గ, వర్ణ ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉపయోగించుకున్నారు. కానీ సంస్కృతంలో మతసాహిత్యంతో పాటు లౌకిక సాహిత్యం ఉన్నందునే మలయశ్రీ సంస్కృత భాష, సాహిత్యాలను అధ్యయనం చేసి అదే భాషలో హేతువాద, మానవవాద కవిత్వాన్ని రచించారు.

### తెలంగాణ మాండలికంపై మక్కువ..

'మీది తౌరక్య ఆంధ్రం' అంటూ వెటకారమాడిన సీమాంధ్ర పండితులకు సమాధానంగా 'తెలంగాణదే అసలు తెలుగు' అని మలయశ్రీ నిరూపించారు. స్థానిక-మాండలిక పదాలను వదలితే ఈ రెండు ప్రాంతాల క్రియాపదాల నడుమ చాలా తేడా ఉందన్న మలయశ్రీ, పదాల పరిణామక్రమాన్ని తన 'తెలంగాణ చరిత్ర, సంస్కృతి, జనజీవనం' అనే పుస్తకంలో సోదాహరణంగా వివరించారు. నన్నయ భారతంలోని "వచ్చియున్నవాండు ఫల్గునుండు' అనే వాక్యాన్ని తీసుకొని ఇందులోని 'వచ్చియున్నవాండు.. వచ్చినడు.. వచ్చిండు అయ్యే.. వచ్చాడు మీదెట్లవచ్చె? ఇంక వచ్చేసినాడెట్ల వచ్చె!" అని నిలదీశారు. (వచ్చిండు: తెలంగాణ, వచ్చాడు-: కోస్తా, వచ్చేసినాడు:- సీమ) 2003 నవంబర్ 1న అమరావతిలో 'తెలుగు భాషోద్యమ సమాఖ్య' నిర్వహించిన మాండలిక భాషా సదస్సులో -

**'అరవ కన్నడ ఒరియ ఆంగ్లమ్ము కలగలిపి**

**అందమా మీ ఆంధ్ర కులుకు?**

**అచ్చ తెలుగుకు కొంత ఉర్దూ కలిస్తేనే**

**నచ్చమా మా తెలుగు పలుకు!**

అంటూ మలయశ్రీ సీమాంధ్ర పండితులకు చురక అంటించారు. మనతో మాట్లాడుతున్నట్లుగా 'వచనం' రాయడం మలయశ్రీ ప్రత్యేకత. మాండలికభాష అంటే మలయశ్రీకి ఎంతో ప్రేమ. కానీ మాండలికం, గ్రామ్యం వేర్వేరు అనే విషయం గుర్తుంచుకోవాలని, గ్రామ్యం అన్ని సందర్భాల్లో ప్రయోగార్హం కాదని చెప్తుంటారు. ఉదాహరణకు 'విచిత్రం' అనేందుకు నోరు తిరగని నిరక్షరాస్యులు 'ఇసిత్రం', 'ఇచ్చెంతురం' అంటే దానిని కవి/ రచయిత తమ మాటగా రాయవద్దని, అది ఆయా పాత్రల వరకే పరిమితం చేయాలనేది మలయశ్రీ ప్రధాన సూచన.

### కరుడుగట్టిన భౌతికవాది..

మలయశ్రీ ఒక కరడుగట్టిన భౌతికవాది. ఆదిమ మతాల వల్లే ఆధునికులు సతమతమవుతున్నారనేది ఆయన నిశ్చితాభిప్రాయం. మూఢనమ్మకాలను వీడాలంటే ముందు దేవుడిని వీడాలంటారాయన. ఎందుకంటే 'మూఢ నమ్మకాల ముత్తాత పేరే దేవుడు' అని నిర్మొహమాటంగా చెప్తారు. నాస్తికత్వం, ఆస్తికత్వం గురించి చెప్తూ ఈ రెంటి మధ్య ఒప్పుకూ తప్పుకూ, సత్యానికి అసత్యానికి, మానవత్వానికి, పశుత్వానికి, నారికతకూ, అనాగరికతకూ నడుమ ఉన్నంత తేడా ఉందంటారు. ఆత్మ అబద్ధమని, స్వర్గ, నరకాలు ఊహాజనితాలంటూ కొట్టిపారేసేవారు. ఆర్థిక అసమానతలకు, సామాజిక అంతరాలకు కారణమైన మతాన్ని విడిచే పెద్దే తప్ప మానవత్వం సాధ్యం కాదంటారు. ఈ క్రమంలోనే మనువాదాన్ని, వైదిక క్రతువులను ఆయన వదిలించుకున్నారు. తన కులాన్ని, మతాన్ని విడిచిపెట్టారు. తగదని వారించిన వారినీ పక్కనపెట్టేశారు. ఒక భౌతికవాదిగా తాను నమ్మిన సిద్ధాంతానికి మలయశ్రీ తుదకంటా కట్టుబడి ఉన్నారు. మాటలు, రాతల్లోనే కాదు, చేతల్లోనూ దీనిని నిరూపించారు. తన కూతురికి అన్య మతస్థునితో ఆదర్శ వివాహం జరిపించడంతోపాటు వారింట ఇప్పటివరకు జరిగిన వివాహాలన్నీ స్టేజ్ మ్యారేజీ లే కావడం విశేషం. తన తండ్రి మరణిస్తే కింద వేసి పాడె కట్టడాన్ని నిరాకరించిన వ్యక్తి మలయశ్రీ. కొన్నాళ్ల క్రితం ఆయన సహచరణి కాలం చేస్తే కర్మకాండల ఊసెత్తలేదు. ఈ విషయంలో ప్రజల్ని చైతన్యపరిచేందుకు 'భౌతికవాది' పేరుతో మలయశ్రీ సామాజిక చైతన్య పత్రిక నడిపారు. ప్రగతిశీల కవులు, రచయితలను ప్రోత్సహించేందుకు తన నవ్యసాహిత్య పరిషత్సంస్థ ద్వారా ఏటా సాహితీ అవార్డులను అందిస్తూ వచ్చారు. 'మానవత్వమే నా మతం.. మానవుడే నా దేవుడు..' అని ఎలుగెత్తి చాటిన మనిషి కవి మలయశ్రీ.. తరతరాలకు కావాల్సినంత సాహితీ సంపదను తెలుగు పాఠకలోకానికి అందించి ఇప్పుడు కానరాని లోకాలకు వెళ్లిపోయారు. ఆయన నాతో తరుచూ చెప్పే మాట గుర్తుకొస్తుంది..

### సెలవిప్పటికి... స్నేహమెప్పటికీ..



# తీరంలో వేటకు విరామం

## నిషేధం అమలు తర్వాత వేటకు వెళ్తే చర్యలు-రెండు నెలల పాటు

## మత్స్యకారులను ఆదుకునేలా ప్రభుత్వం భరోసా



రాష్ట్రంలోని తీరప్రాంతంలో చేపల వేటపై నుంచి నిషేధం అమల్లోకి రానుంది. దీంతో బాపట్ల జిల్లా చీరాల, వేటపాలెం, చినగంజాం,తో పాటు జిల్లాలోని సముద్రతీరంలో వేటను అధికారులు నిషేధించారు. చీరాల మండలం వాడరేవు సముద్రతీరంలో బోట్లు, వలలను మత్స్యకారులు ఒడ్డుకు తీసుకువచ్చి భద్రపరుస్తున్నారు. సముద్ర జీవసంపద పెంపుదల, చేపల సంతానోత్పత్తిని దృష్టిలో ఉంచుకుని ప్రతిఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల పాటు ప్రభుత్వం వేట విరామాన్ని ప్రకటిస్తుంది.

**61 రోజుల విరామం:** ఈ కాలంలో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా కడలి పుత్రులకు ప్రభుత్వం భారీ ఆర్థిక సాయాన్ని కూడా అందజేస్తోంది. ప్రతి ఏటా వేసవి కాలంలో చేపలు, ఇతర సముద్ర జీవులు సంతానోత్పత్తి చేస్తాయి. ఈ కీలక సమయంలో యాంత్రిక పడవలతో వేట సాగిస్తే మత్స్య సంపద అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సముద్ర పర్యావరణాన్ని కాపాడటానికి రాష్ట్ర మత్స్యశాఖ ఈ 61 రోజుల విరామాన్ని తప్పనిసరి చేసింది. ఈ నిబంధనలు రాష్ట్రంలోని అన్ని రకాల మోటారు బోట్లకు వర్తిస్తాయి. కేవలం సంప్రదాయ పడవల ద్వారా తీరానికి సమీపంలో వేట సాగించే వారికి మాత్రమే మినహాయింపు ఉంటుంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా కట్టాల్సిందే:** వేట విరామ సమయంలో నిబంధనలు అతిక్రమించి సముద్రంలోకి వెళ్లే వారిపై మత్స్యశాఖ కఠినంగా వ్యవహరించనుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ. 5,000 జరిమానా విధించడమే కాకుండా, వారి వలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. అంతేకాకుండా, సదరు బోటు యొక్క లైసెన్స్, రిజిస్ట్రేషన్ను ఏడాది పాటు రద్దు చేస్తారు. తీరప్రాంతాల్లో నిఘా ఉంచేందుకు కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల సహకారం తీసుకోనున్నారు. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం భరోసా కలిపిస్తుంది.

**ప్రభుత్వ ఆర్థిక సాయం:** వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రభుత్వం 'మత్స్యకార భరోసా' పథకం కింద ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి రూ. 20,000 ఆర్థిక సాయం అందజేస్తోంది. గత మూడేళ్ళ క్రితం ఆర్థిక సాయం అందలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది మత్స్యకార జీవన భృతి 20 వేలు ఇచ్చారని, ఈ ఏడాది కూడా ఇదే నెలలో భృతి ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు.

# తెలంగాణలో భానుడి భగభగలు

## బయటకు వెళ్తే ఈ జాగ్రత్తలు పాటించడం మేలు

## తెలంగాణలో మండుతున్న ఎండలు

## ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు

## బయటకు వెళ్లినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్లు

## 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు



ఈసారి మార్చి నెల నుంచే ప్రజలు భానుడి ప్రతాపానికి అతలాకుతలం అవుతున్నారు. ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది దాటకముందే సూర్యుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. తెలంగాణలో ఇప్పటికే 42 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో సన్స్ట్రోక్ నుంచి రక్షించుకోవడం చాలా ముఖ్యం.

**నెత్తిపై నిప్పుల కుంపటి :** మండుతున్న ఎండలు, ఉక్కపోత వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 42 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో పాటు వడగాలులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేదు వార్తనందించింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లోనే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా రానున్న రెండు రోజుల్లో ఎండలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఎండ వేడి మాత్రమే కాదు ఉపశమనం కోసం తీసుకునే శీతల పానీయాలు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**సన్స్ట్రోక్ బీ అలర్ట్ :** వేసవికాలంలో ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో బయటకు వెళ్లడం ప్రమాదకరమని చెబుతున్నారు. ఈ సమయంలో సన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. చెమట రాకపోవడం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సన్ స్ట్రోక్ బ్రెయిన్పై ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో నిర్లక్ష్యం చేయొద్దని చెబుతున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు."వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఉదయం 9-10 గంటలకే విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఆ వేడి ప్రభావం మనకు తెలుస్తోంది. ఇంట్లో నుంచి బయటకు రాగానే అబ్బా ఇంత వేడా అనే భావన వస్తుంది. దీనికోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అందరికీ తెలిసిన విషయం హీట్ స్ట్రోక్. సైంటిఫిక్గా అనాలసిస్ చేస్తే హాట్ ఎక్సర్షనల్, హీట్ స్ట్రోక్. వీటిని గమనించడం చాలా అవసరం. ఎందుకంటే పిల్లలు, వృద్ధులు తప్పకుండా చూసుకోవాలి. వీటికి బారిన పడినప్పుడు మన శరీరం మనకు చెబుతోంది. ఈ సమ్మర్లో లూజ్గా ఉండే దుస్తులు వేసుకోవాలి. లైట్ కలర్ ధరించాలి. కాటన్వి అయితే మరి మంచిది. ఒకవేళా తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే మాత్రం డ్రెస్సింగ్ కాకుండా ఒక టోపి, గొడుగు, వాటర్ బాటిల్ను క్యారీ చేయండి. ఎండ బారిన పడకుండా చూసుకోండి"

# వడదెబ్బతో మరణిస్తే రూ.4లక్షల ప్రభుత్వ పరిహారం



## సింపుల్గా ఇలా దరఖాస్తు చేసుకోండి

## రాష్ట్రంలో రోజురోజుకూ పెరగుతున్న ఉష్ణోగ్రతలు

## వడదెబ్బ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వ చర్యలు

## బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు రూ.4లక్షల వరకు ఆర్థిక సాయం దరఖాస్తు విధానం ఇదే

రాష్ట్రంలో రోజురోజుకూ భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఈ ఎండలకు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పొట్టకూటికోసం రోజంతా ఎండలో పనిచేసే కూలీలు, బాటసారులు వడదెబ్బ బారినపడి మృత్యువాత పడుతున్న ఘటనలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతున్నాయి. ఇలా దిక్కుతోచని స్థితిలో ఉన్నటువంటి బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.4లక్షల వరకు ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. అది ఎలా పొందాలి? ఏయే పత్రాలు అవసరం అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

రూ. 4 లక్షల వరకు పరిహారం :

వడదెబ్బ కారణంగా మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం రూ.4లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది.

ఈ నగదు 'స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్డీఆర్ఎఫ్)' కింద మంజూరవుతుంది.

మరణించిన వెంటనే మృతదేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించాలి.

వడదెబ్బతో మరణం సంభవించినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్తో ఫిర్యాదు చేయాలి. పోలీసులు పోస్ట్మార్టం నిర్వహించి కేసు నమోదు చేయాల్సి ఉంటుంది.

మరణించిన రోజున ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణంకంటే అధికంగా ఉన్నాయని వాతావరణ శాఖ (ఐఎండీ) నుంచి ధ్రువీకరణ పత్రం అవసరం.

**దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు ఇవే :**

ప్రభుత్వ ఆసుపత్రి ఇచ్చిన శవపరీక్ష రిపోర్టు

స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్(ప్రాథమిక సమాచార నివేదిక), ఫైనల్ రిపోర్ట్

డెత్ సర్టిఫికెట్(మరణ ధ్రువీకరణ పత్రం)

మృతుడి, వారసుల ఆధార్ కార్డుల జిరాక్సులు బ్యాంకు పాస్బుక్ వివరాలు (పరిహారం జమచేసేందుకు)

కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం

**దరఖాస్తు ఇలా :**

వడదెబ్బతో మరణం సంభవించిన వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలి.

అన్ని డాక్యుమెంట్లతో తహసీల్దారు ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలి.

రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టరుకు పంపిస్తారు.

అక్కడ ఆమోదం పొందాక నిధులు నేరుగా నామినీ అకౌంట్లో జమవుతాయి.

"చాలా మంది శవపరీక్ష చేయకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. వ్యక్తి మృతి చెందిన 24 గంటల లోపు తప్పనిసరిగా పోస్టుమార్టంను చేయాలి. రిపోర్టులో మరణానికి కారణం హైపర్థెర్మియా లేదా వడదెబ్బ అని వైద్యులు స్పష్టంగా పేర్కొనాలి. అలాంటప్పుడు మాత్రమే బాధిత కుటుంబానికి పరిహారం అందుతుంది''"సాయిరాం, ఆర్డీవో, సికింద్రాబాద్

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com